# దుర్శకునం: దాని ప్రమాదం మరియు నివారణ

## ప్రసారమయ్యే మరియు పంపిణీ చేయబడే జుమా ఖుత్బా

## 1448 హి|జ్రీ రబీఉల్ అవ్వల్ 22వ తేదీ, అనగా 4-9-2026 క్రీస్తుశకం

ఇన్నల్-హమ్ద లిల్లాహి, నహ్మదుహూ వ నస్తఈనుహూ వ నస్తగ్ఫిరుహూ, వ నఊదు బిల్లాహి మిన్ షురూరి అన్ఫుసినా వ మిన్ సయ్యిఆతి అఅమాలినా. మన్ యహ్దిహిల్లాహు ఫలా ముదిల్ల లహూ, వ మన్ యుద్లిల్ ఫలా హాదియ లహూ. వ అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహూ లా షరీక లహూ, వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహూ.

యా అయ్యుహల్లదీనా ఆమనుత్తకుల్లాహ హక్క తుకాతిహీ వలా తమూతున్న ఇల్లా వఅంతుమ్ ముస్లిమూన్. [ఆలె ఇమ్రాన్: 102]

ఓ ముస్లింలారా! నికార్సయిన ఈమాన్, స్వచ్ఛమయిన తౌహీద్ యొక్క నిబంధనలలో ఒకటి ఏమిటంటే: మనిషి తన విశ్వాసానికి, ధర్మానికి భంగం కలిగించే, అలాగే తన తౌహీద్‌ను మరియు నమ్మకాన్ని దెబ్బతీసే ప్రతిదానికీ దూరంగా ఉండాలి. మన సత్యధర్మం రద్దు చేసిన, మరియు మన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మనలను హెచ్చరించిన అజ్ఞాన కాలపు అలవాట్లలో 'అపశకునం భావించడం' (తషావుమ్) ఒకటి. ఎందుకంటే దీనివలన మనిషి తన కోరికల సాధనకు మరియు భయాల నుండి రక్షణకు అల్లాహ్ ను తప్ప ఇతర శక్తులను ఆశ్రయించే దుస్థితి అతని హృదయములో ఏర్పడుతుంది.

పూర్వకాలంలో అవివేకులు పక్షుల ద్వారా అపశకునాలను భావించేవారు. ఒక పక్షి కుడివైపుకు ఎగిరితే, దానిని శకునంగా భావించి అనుకున్న పనిని పూర్తి చేసేవారు; ఒకవేళ అది ఎడమవైపుకు ఎగిరితే, దానిని కీడుగా భావించి ఆ పనిని విరమించుకునేవారు. అలాగే వారి ఇంటిపై కాకి వచ్చి వాలితే, దానిని అపశకునంగా భావించి ఏదో అశుభం జరుగుతుందని భయపడేవారు.

అల్లాహ్ దాసులారా! అపశకునం భావించడంలో అనేక రకాలు, రూపాలు ఉన్నాయి. ఉదాహరణకు: క్రైస్తవులు నమ్మినట్లుగా 13 అనే నిర్దిష్ట సంఖ్యను అపశకునంగా భావించడం, లేదా ఒక వ్యక్తిని చూసి అపశకునంగా భావిస్తూ: "ఫలానా వ్యక్తి ముఖం శని లాంటిది, అతనితో ప్రయాణించినప్పుడల్లా నాకు ఏదో ఒక కీడు

జరుగుతుంది" అని అనడం, లేదా కొందరు "ఖైర్ యా ఖైర్" (ఏదో పక్షి ఎగిరినట్లుంది, ఏమవుతుందో) అని అనడం. ఇవన్నీ నిషేధించబడ్డాయి. ఎందుకంటే మేలు అనేది కేవలం సర్వశక్తి మంతుడైన అల్లాహ్ వైపు నుండే వస్తుంది, సమస్త శుభాలు ఆయన చేతిలోనే ఉన్నాయి, మరియు ప్రతీ వ్యవహారం ఆయన వైపుకే మరలింపబడుతుంది.

### దుశ్శకునం యొక్క వాస్తవ స్వరూపం

దుశ్శకునం వాస్తవానికి షైతాను మనిషి హృదయంలో వేసే భయాలు, భయపెట్టే ఆలోచనలు మరియు చెడు ప్రేరణలు నుండి ఉత్పన్నమవుతుంది. అలాగే అది అల్లాహ్‌ను విడిచి ఇతరులపై ఆధారపడటానికి, అల్లాహ్ గురించి చెడు అభిప్రాయం కలిగి ఉండటానికి దారితీస్తుంది.

ఎందుకంటే, దుశ్శకునాన్ని పాటించే వ్యక్తి–అల్లాహ్ ను విడిచి, ఈ వస్తువు తనకు మేలు లేదా కీడు కలిగించగలదని నమ్ముతాడు. అందువల్ల దుశ్శకునాన్ని నిర్మూలించేందుకు కృషి చేయడం, దాని మూలాలను పెకలించడం విధిగా మారుతుంది. ప్రత్యేకించి, ప్రవక్త ﷺ దానిని షిర్కుగా పేర్కొని, ఉమ్మత్‌ను దాని నుండి హెచ్చరించారు.

ఇబ్నె మస్‌ఊద్ రజియల్లాహు అన్హు కథనం ప్రకారం, దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు:

«الطِّيَرَةُ شِرْكٌ، الطِّيَرَةُ شِرْكٌ»

"అపశకునం భావించడం షిర్క్, అపశకునం షిర్క్." (అహ్మద్, అబూ దావూద్; అల్బానీ దీనిని సహీహ్ అని ధృవీకరించారు)

ఇక్కడ 'అల్–తియరా' (పక్షుల ద్వారా శకునాలు చూసే పద్ధతి) అనేది అపశకునం యొక్క అనేక రూపాలలో ఒక రూపం.

అపశకునాలు నమ్మడం ప్రవక్తల శత్రువులైన అవివేకుల (కాఫిర్ల) లక్షణం. ఫిర్ఔన్ ప్రజలకు ఏదైనా విపత్తు లేదా కరువు సంభవించినప్పుడు, ఆ ఆపద ప్రవక్త మూసా (మూసా అలైహిస్సలామ్) మరియు ఆయన అనుచరుల అపశకునం వల్లే వచ్చిందని భావించేవారు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَإِنْ تُصِبْهُمْ سَيِّئَةٌ يَطَّيَّرُوا بِمُوسَى وَمَنْ مَعَهُ

"మరియు వారికి ఏదైనా కీడు సంభవిస్తే, దానిని మూసా మరియు ఆయనతో ఉన్నవారి అపశకునంగా భావించేవారు." (అల్–ఆరాఫ్: 131)

దానికి అల్లాహ్ వారికి ఈ విధంగా సమాధానమిచ్చాడు:

أَلَا إِنَّمَا طَائِرُهُمْ عِنْدَ اللَّهِ

"జాగ్రత్త! వారి అపశకునం (విధి వ్రాత) అల్లాహ్ వద్దనే ఉంది."

అంటే, వారికి వచ్చిన ఆపదలు వారి నిరాకరణ (కుఫ్ర్), పాపాలు మరియు మూసా అలైహిస్సలామ్‌ను తిరస్కరించడం వల్ల, అల్లాహ్ యొక్క ఆదేశం మరియు విధివ్రాత (ఖధా–ఓ–ఖద్ర్) ప్రకారమే సంభవించాయి. ఆ తర్వాత వారిలో ఎక్కువ మంది అజ్ఞానులని అభివర్ణిస్తూ ఇలా అన్నాడు:

وَلَكِنَّ أَكْثَرَهُمْ لَا يَعْلَمُونَ

"కాని వారిలో చాలామంది ఆ సంగతి గ్రహించడం లేదు."

ఏకేశ్వరోపాసకులైన (మువహ్హిదీన్) విశ్వాసుల స్థితి ఎలా ఉంటుందంటే, వారు తౌహీద్  యొక్క గౌరవాన్ని కాపాడటంలో ఎంతో శ్రద్ధ వహిస్తారు, మరియు దాని సరిహద్దులను అతిక్రమించే వారిని తీవ్రంగా ఖండిస్తారు.

ఒకసారి ఒక పక్షి అరుస్తూ ఎగిరి పోతుంటే, ఒక వ్యక్తి: "శుభం! శుభం!" అని అన్నాడు. దానికి ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు అన్హుమా వెంటనే ఖండిస్తూ: "ఇందులో శుభమూ లేదు, అశుభమూ లేదు" అని అన్నారు. ఆ పక్షికి మేలు లేదా కీడు చేసే శక్తి ఉందని ఆ వ్యక్తి నమ్మకూడదనే ఉద్దేశంతో ఆయన వెంటనే దానిని వారించారు.

ఓ ముస్లిం సోదరులారా! కొన్నిసార్లు అపశకునపు ఆలోచనలు ప్రమేయం లేకుండానే హృదయంలో కలగవచ్చు, మరియు ఉద్దేశపూర్వకంగా కాకుండానే కొన్ని విషయాల పట్ల భయం, భావన కలగవచ్చు. దీని నుండి తప్పించుకోవడం ఎవరికైనా కష్టమే. అయితే, ఎవరికైనా అలా అనిపించినప్పుడు దానిని పట్టించుకోకుండా, తన ప్రభువుపైనే భయభక్తులతో మరియు ఆశతో సంపూర్ణ నమ్మకం ఉంచి తాను చేయాలనుకున్న పనిని పూర్తిచేస్తే, ఆ భావన అతనికి ఏ రకమైన హాని చేయదు. అటువంటి సమయంలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నేర్పిన ఈ దుఆను చదవాలి:

«اللَّهُمَّ لَا يَأْتِي بِالْحَسَنَاتِ إِلَّا أَنْتَ، وَلَا يَدْفَعُ السَّيِّئَاتِ إِلَّا أَنْتَ، وَلَا حَوْلَ وَلَا قُوَّةَ إِلَّا بِكَ»

"ఓ అల్లాహ్! మేలును ప్రసాదించేవాడవు నీవు తప్ప ఎవ్వరూ లేరు, మరియు కీడును నివారించేవాడవు నీవు తప్ప ఎవ్వరూ లేరు. నీ సహాయం మరియు శక్తి లేకుండా ఏ పని చేయలేము."

(అబూ దావూద్ – స్వచ్ఛమైన సనద్‌తో నిరూపించబడింది)

అయితే, ఎవరైనా తనకు నచ్చనిదానిని చూసి లేదా విని, అపశకున భావనతో తాను చేయాలనుకున్న పనిని విరమించుకుంటే, అతను ఒక తీవ్రమైన నేరానికి మరియు పెద్ద పాపానికి ఒడిగట్టినట్లే. అలాంటి వ్యక్తి వెంటనే అల్లాహ్ వైపునకు మరలి పశ్చాత్తాపపడాలి (తౌబా చేయాలి).

అబ్దుల్లాహ్ బిన్ అమర్ (రజియల్లాహు అన్హుమా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు:

»مَنْ رَدَّتْهُ الطِّيَرَةُ مِنْ حَاجَةٍ فَقَدْ أَشْرَكَ«

"ఎవరినైనా అపశకున భావన తన అవసరం లేదా పని నుండి వెనక్కి మళ్లిస్తుందో, అతను షిర్క్ చేసినట్లే."

సహాబా: "ఓ అల్లాహ్ ప్రవక్తా! దానికి పరిహారం (కఫ్ఫారా) ఏమిటి?" అని అడుగగా, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

»اللَّهُمَّ لَا خَيْرَ إِلَّا خَيْرُكَ، وَلَا طَيْرَ إِلَّا طَيْرُكَ، وَلَا إِلَهَ غَيْرُكَ«

"ఓ అల్లాహ్! నీవు ఇచ్చే మేలు తప్ప వేరే ఏ మేలూ లేదు, నీవు నిర్ణయించిన శకునం (విధివ్రాత) తప్ప వేరే ఏదీ లేదు, మరియు నీవు తప్ప ఆరాధనకు అర్హుడైన నిజ దేవుడు మరొకడు లేదు."

(అహ్మద్ – హసన్ సనద్‌తో నిరూపించబడింది)

కాబట్టి ప్రతీ ముస్లిం ఈ మూఢనమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉండాలి మరియు ఇతరులను కూడా హెచ్చరించాలి. ఎందుకంటే అపశకునాన్ని నమ్మే వ్యక్తి అల్లాహ్‌పై ఉన్న నమ్మకాన్ని తెంచుకుని, ఒక అవాస్తవిక ఊహకు బానిసవుతాడు. దానికి భిన్నంగా, సమస్త వ్యవహారాల నియంత్రణ తన చేతిలోనే ఉన్న తన సృష్టికర్తపైనే సంపూర్ణ ఆధారపడాలి, మరియు ఇలాంటి భ్రమలు, మూఢనమ్మకాలు తనను లక్ష్యం నుండి వెనక్కి మళ్లించకుండా చూసుకోవాలి.

అల్లాహ్ మనకు మరియు మీకు ఈ మహోన్నతమైన ఖురాన్ ద్వారా శుభాలను ప్రసాదించుగాక! మరియు ఇందులోని ఆయత్‌లు, జ్ఞానయుక్తమైన ఉపదేశాల ద్వారా మనందరికీ ప్రయోజనం చేకూర్చుగాక! నేను ఈ మాటలు చెబుతూ, నా కోసం మరియు మీ కోసం ప్రతీ పాపం నుండి అల్లాహ్ యొక్క క్షమాపణను కోరుతున్నాను, మరియు ఆయన వైపునకే పశ్చాత్తాపపడుతున్నాను. నిశ్చయంగా ఆయన క్షమాశీలుడు, అత్యంత దయామయుడు.

**రెండవ ఖుత్బా**

అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్, వస్సలాతు వస్సలాము అలా అష్రఫిల్ ముర్సలీన్, నబియ్యినా ముహమ్మదిన్, వఅలా ఆలిహీ వ సహ్‌బిహీ అజ్‌మయీన్.

నేను నన్ను మరియు మిమ్మల్ని అల్లాహ్ భయభక్తులు (తఖ్వా) కలిగి ఉండాలని ఆదేశిస్తున్నాను. ఎందుకంటే అల్లాహ్‌కు భయపడే వ్యక్తిని ఆయన కాపాడతాడు, రక్షిస్తాడు మరియు ఆశ్రయం ఇస్తాడు.

అల్లాహ్ దాసులారా! అపశకునం భావించడం (తషావుమ్) మరియు మంచి శకునం భావించడం (తఫావుల్) మధ్య చాలా వ్యత్యాసముంది. అపశకునం అనేది షిర్క్ మరియు హరామ్ (నిషేధించబడినది); కానీ మంచి శకునం అనేది మంచిది మరియు ముస్తహబ్. అపశకునం అనేది సర్వోన్నతుడైన అల్లాహ్ పట్ల చెడు అభిప్రాయాన్ని కలిగి ఉండటం, కానీ మంచి శకునం అనేది ఆయనపై నమ్మకాన్ని, మంచి అభిప్రాయాన్ని కలిగి ఉండటం. ఒక ముస్లిం అన్ని వేళలా అల్లాహ్ పట్ల సదభిప్రాయంతో ఉండాలని ఆదేశించబడ్డాడు.

'ఫాల్' (మంచి శకునం) అంటే ఏమిటంటే: ఒక వ్యక్తి అల్లాహ్‌పై సంపూర్ణ నమ్మకం ఉంచి ఒక పనిని చేయాలనుకున్నప్పుడు లేదా నిర్ణయించుకున్నప్పుడు, అతనికి సంతోషాన్నిచ్చే ఒక మంచి మాట వినబడటం. దానివల్ల అతను చేయబోయే పనిలో మరింత ఉత్సాహం, ధైర్యం పొందుతాడు, అతని హృదయానికి ప్రశాంతత, ఆనందం కలుగుతాయి. ఉదాహరణకు, 'ముబారక్' (శుభప్రదుడు) అనే పేరు గల వ్యక్తిని చూసి, ఆ రోజు అంతా శుభం జరుగుతుందని ఆశించడం.

అనస్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు:

«لَا عَدْوَى وَلَا طِيَرَةَ، وَيُعْجِبُنِي الْفَأْلُ الصَّالِحُ: الْكَلِمَةُ الْحَسَنَةُ»

"అంటువ్యాధి (అల్లాహ్ ఆజ్ఞ లేనిదే) వ్యాపించదు, అపశకునం అనేది లేదు. కానీ నాకు మంచి శకునం (అల్-ఫాల్ అస్-సాలిహ్) ఇష్టం, అది మంచి మాట." (బుఖారీ, ముస్లిమ్)

హుదైబియా సంధి సమయంలో, సుహైల్ బిన్ అమర్ (రజియల్లాహు అన్హు) – అప్పుడు ఆయన ఇంకా కాఫిర్ (అవిశ్వాసి) గా ఉన్నప్పుడు – ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చినప్పుడు, ఆయన పేరులోని అర్థాన్ని బట్టి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మంచి శకునంగా భావిస్తూ ఇలా అన్నారు:

«لَقَدْ سَهُلَ لَكُمْ مِنْ أَمْرِكُمْ»

"మీ పని ఇప్పుడు సులభతరమైంది (సుహైల్ అంటే సులభమైనది అని అర్థం)."

(ఇక్రిమా కథనం – ముర్సల్ నివేదనతో బుఖారీ సేకరించారు)

ఇమామ్ ఇబ్న్ అల్-ఖయ్యిమ్ (రహిమహుల్లాహ్) ఇలా అన్నారు: "మంచి శకునాన్ని ఇష్టపడటం లేదా ఆనందించడంలో షిర్క్ యొక్క ఛాయలు కూడా లేవు. పైగా ఇది మానవ సహజ సిద్ధమైన స్వభావానికి అద్దం పడుతుంది. మనిషి ఎల్లప్పుడూ తనకు మేలు చేసే, అనుకూలమైన విషయాల వైపే మొగ్గు చూపుతాడు."

కాబట్టి మీ సృష్టికర్త పట్ల మంచి అభిప్రాయాన్ని కలిగి ఉండండి, మీ అన్ని వ్యవహారాలలో ఆయనపైనే ఆధారపడండి. అల్లాహ్ పట్ల దురభిప్రాయం కలగకుండా జాగ్రత్తపడండి; ఎందుకంటే ఆయన నిర్ణయాలన్నీ మేలుకే. ఎవరైతే ఏదైనా వస్తువును లేదా శకునాన్ని ఆశ్రయిస్తారో, వారు దానికే వదిలేయబడతారు.

عَلَيْهِ تَوَكَّلْتُ وَإِلَيْهِ أُنِيبُ

"నేను ఆయనపైనే నమ్మకం ఉంచాను, మరియు ఆయన వైపునకే మరలుతున్నాను." (హూద్: 88)

ఓ అల్లాహ్! నీవు నిషిద్ధం చేసిన (హరామ్) వాటి నుండి మమ్మల్ని కాపాడి, నీవు అనుమతించిన (హలాల్) ఉపాధితో మాకు తృప్తిని ప్రసాదించు. నీ కరుణతో నీవు తప్ప ఇతరుల సహాయం అవసరం లేకుండా మమ్మల్ని ధనవంతులను చేయి.

ఓ అల్లాహ్! మాకు ఈమాన్ (విశ్వాసం) పై ప్రేమను కలిగించు, దానిని మా హృదయాలలో అందంగా తీర్చిదిద్దు. మరియు అవిశ్వాసం, పాపాలు, విధేయతారాహిత్యం పట్ల మాకు అసహ్యాన్ని కలిగించు. మమ్మల్ని సన్మార్గంలో నడిచేవారిలో చేర్చు.

ఓ అల్లాహ్! ఇస్లాంను మరియు ముస్లింలను గౌరవించు, షిర్క్ మరియు ముష్రిక్కులను అంత మొందించు. నీ ధర్మానికి, నీ గ్రంథానికి, నీ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్‌కు మరియు నీ విశ్వాసకులైన దాసులకు విజయాన్ని ప్రసాదించు.

ఓ అల్లాహ్! ముస్లిం పురుషులను, ముస్లిం స్త్రీలను, విశ్వాసులైన పురుషులను మరియు విశ్వాసులైన స్త్రీలను – వారిలో సజీవులను మరియు మరణించిన వారిని క్షమించు.

ఓ అల్లాహ్! మా పాలకుడిని మరియు ఆయన వారసుడిని నీ సన్మార్గంలో నడిపించు. వారి పనులను నీ విధేయత మరియు సంతృప్తి కొరకే ఉంచు. ఈ దేశాన్ని (కువైట్‌ను) ప్రశాంతత, సమృద్ధి, భద్రత మరియు ఈమాన్‌తో నిండిన రాజ్యంగా మార్చు, అలాగే సమస్త ముస్లిం దేశాలను కాపాడు.